ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి



మంజూరు పత్రాన్ని అందజేస్తూ..

రామంతాపూర్: పాత రామంతాపూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌కి అదనపు అంతస్తు నిర్మాణానికి రూ.36 లక్షలు మంజూరు పత్రాన్ని బుధవారం ఉప్పల్ నియోజకవర్గం మందముల పరమేశ్వర్‌రెడ్డి బుధవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం సంపూర్ణంగా అమలు చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షులు ముత్యాల జంగయ్య, ఉపాధ్యక్షులు అరూరి ఆనంద్, ప్రధాన కార్యదర్శి చీమకండ్ల జంగయ్య, ట్రెజరర్ ముత్యాల బాబురావు, భిక్షపతి ప్రకాష్, కుమార్, ఈశ్వర్, అంజయ్య, హరిదర్శన్, శ్రీరామ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత కన్నుమూత



నివాళులర్పిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ రజితారెడ్డి

రామంతాపూర్: డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీమల్లికార్జున స్వామి దేవాలయ మాజీ చైర్మన్ నామ్ గోవర్ధన్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. గోవర్ధన్‌రెడ్డి భౌతిక కాయాన్ని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ రజితారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. డివిజన్‌లో గోవర్ధన్‌రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు కంది ఆదిరెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్ రావు, మురళిగౌడ్, సందీప్ పటేల్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ చాణుక్యపురి కాలనీలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుమారు రూ.28 లక్షలతో పనులు చేపట్టామని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించామన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో రావడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఈ మహేష్, ఏఈ దీపక్, విబి రమేష్, కాలనీవాసులు రవి, వినోద్, అబ్రహం, చైతన్య, మూర్తి పాల్గొన్నారు.

ఎసుస్ స్టోర్స్ విస్తరణ

సాక్షి, సిటీబ్యూరో: సాంకేతికత ఆధారిత గేమింగ్ స్టోర్స్‌కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో నగరంలో తమ స్టోర్స్ విస్తరిస్తున్నట్లు ఎసుస్ ఇండియాకు చెందిన ప్రముఖ బ్రాండ్, రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్(ఆర్‌ఓజీ) ప్రతినిధులు తెలిపారు. నగరంలో తమ 2వ స్టోర్ కొండాపూర్‌లో నెలకొల్పిన ప్రతినిధులు సందర్భంగా మాట్లాడుతూ నగరంలో తమ 4వ స్టోర్‌గా చెప్పారు. దాదాపు 525 చదరపు అడుగుల్లో ఏర్పాటైన ఈ గేమింగ్ జోన్‌లో నోట్‌బుక్‌లు, ఆర్‌ఓజీ పిసిలు ల్యాప్‌టాప్‌లు, ఆల్ ఇన్ వన్ పీసీలు, యాక్సెసరీస్ క్రియేటర్ సిరీస్‌లతో పాటు గేమర్స్ కమ్యూనిటీ కోసం ఒక అనుభవపూర్వక జోన్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు.

డ్రైనేజీ పునర్నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

అల్వాల్: అల్వాల్ డివిజన్ దినకర్‌నగర్ రోడ్డు నంబర్–11లో డ్రైనేజీని పునర్నిర్మించాలని కోరుతూ కాలనీవాసులు బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు ఆయన స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అనిల్‌కిషోర్‌గౌడ్, కృష్ణారావు, విజయ్‌గౌడ్, అమర్‌నాథ్, మోసిన్, విజయ్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నోటీసులు జారీ

కుషాయిగూడ: పెంట్‌హౌజ్ నిర్మాణం చేసిన ఓ నిర్మాణదారుడిని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సింగిరెడ్డి రాజిరెడ్డి అనే బిల్డర్ ఏఎస్‌రావునగర్, త్యాగరాయనగర్‌లో ఇంటిపై పెంట్‌హౌజ్ నిర్మాణం చేపట్టిన విషయంలో బెదిరింపులు తాళలేక పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే.. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బెదిరింపులకు పాల్పడ్డ మల్లికార్జున్ అనే వ్యక్తి ఎంకే యూట్యూబ్ న్యూస్ చానెల్ రిపోర్టర్‌గా ఉన్నట్లు తెలిపారు. ఓల్డ్ సిటీకి చెందిన అతడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి నోటీసులు అందజేసినట్లు ఎస్‌ఐ షఫి తెలిపారు. మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌ను అభినంధించిన డీజీపీ

మేడ్చల్: ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో విజేతగా నిలిచిన హెడ్‌కానిస్టేబుల్‌ను డీజీపీ రవిగుప్తా సన్మానించారు. గిర్మాపూర్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ దేవేంద్ర ప్రసాద్ డ్యూటీ మీట్‌లో ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా పతకం సాధించడంతో బుధవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దేవేంద్రప్రసాద్‌ను డీజీపీ రవిగుప్తా అభినందించారు.

అద్దెకు కుషాయిగూడ ఆరోగ్య ఉపకేంద్రం

- ప్రతినెలా వారి నుంచి రూ.10 వేల కిరాయి తీసుకుంటున్న సిబ్బంది
- కూర్చోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్న పిల్లల తల్లులు
- నిలదీసిన స్థానికులు.. సిబ్బంది పొంతన లేని సమాధానం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పార్కింగ్ స్థలంతో పాటు ఓ గది వ్యాపారులకు అప్పగింత



ఆరోగ్య కేంద్రంలోని ఓ గదిలో ఇలా..



కుషాయిగూడ ఆరోగ్య ఉపకేంద్రం

కుషాయిగూడ: ఆరోగ్య ఉపకేంద్రాన్ని సిబ్బంది ఏకంగా అద్దెకిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. చాలా రోజులుగా నడుస్తున్న ఈ తతంగం ఆ నోలా ఈ నోటా స్థానికుల దృష్టికి వెళ్లడంతో ఆరా తీసి వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చారు. కుషాయిగూడ మెయిన్‌రోడ్డులోని కుషాయిగూడ ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రతి సోమ, బుధవారం చిన్నారులు, గర్భిణులకు టీకాలు వేస్తారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది గేటు ముందు పార్కింగ్ స్థలంతో పాటు కేంద్రంలోని ఓ గదిని కుండల వ్యాపారులకు అద్దెకు ఇచ్చి ప్రతినెలా వారి నుంచి రూ.10 వేల కిరాయి తీసుకుంటూ చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. విషయం తెలిసిన కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం ముందు పార్కింగ్ స్థలంలో పూర్తిగా కుండలు నింపి యథేచ్ఛగా వ్యాపారం చేసుకుంటూ కేంద్రంలోని ఓ గదిలో వారికి సంబంధించిన కుండలు ఇతర సామాగ్రిని పెట్టుకున్నారు. ఇదేమిటని వ్యాపారులను ప్రశ్నించగా మీకేం సంబంధం అంటూ అసోసియేషన్ ప్రతినిధులపై తిరగబడ్డారు.

నిర్లక్ష్యంగా సమాధానం..

ఈ విషయంపై ఉపకేంద్రం సిబ్బందిని నిలదీయగా పలుమార్లు ఇక్కడి నుంచి తీసివేయాలని చెప్పినా వారు వినకుండా తాము స్థానికులం అంటూ మమ్మల్నే బెదిరిస్తున్నారని, ఏం చేయమంటారని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు. ఈ విషయాన్ని మీపై అధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలో టీకాలు వేయించేందుకు కేంద్రానికి వచ్చే చంటి పిల్లల తల్లులకు కూర్చోవడానికి కూడా స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అలాగే ఆరోగ్యకేంద్రం గేటు ముందు పార్కింగ్ స్థలంలో అక్రమంగా వ్యాపారం చేసుకుంటున్న వారిని అక్కడి నుంచి తొలగించాలన్నారు.



ఆరోగ్య కేంద్రం పార్కింగ్ స్థలంలో ఇలా..

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



కుషాయిగూడలో ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రంలో జరుగుతున్న అద్దె బాగోతంపై సంబంధిత అధికారులు స్పందించాలి. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అక్రమ వ్యాపారులను తొలగించి ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి కావాల్సిన వసతుల కల్పనపై కూడా దృష్టి సారించాలన్నారు.

– పనగట్ల చక్రపాణిగౌడ్, కుషాయిగూడ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి



సర్టిఫికేట్ అందుకుంటున్న అక్షయ్‌కుమార్

బోడుప్పల్: బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.అక్షయ్‌కుమార్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి పొందారు. ఫిజికల్ సైన్స్ ఫోరం, తెలంగాణ బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో నిర్వహించిన జిల్లా లెవెవల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో బోడుప్పల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి అక్షయ్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలవగా సర్టిఫికేట్‌తో పాటు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా ప్రతిభ ఉన్న విద్యార్థులు ఎంతో మంది ఉన్నారని, వారిని ఆయా రంగాల్లో రాణించే విధంగా తర్ఫీదు ఇస్తామన్నారు. చక్కటి వాతావరణంలో ఉత్తమ బోధన చేస్తూ వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, వనజ పాల్గొన్నారు.

కుషాయిగూడ ఏసీపీగా నరేష్‌రెడ్డి



కుషాయిగూడ: కుషాయిగూడ ఏసీపీగా పింగళి నరేష్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వర్తించిన రవీందర్ డీజీ కార్యాలయానికి వెళ్లగా హ్యూమన్ రైట్స్ కమిషన్ నుంచి నరేష్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

విప్లవ ప్రగతికి ధృవనక్షత్రం లెనిన్



మల్కాజిగిరి: విప్లవ ప్రగతికి ధృవ నక్షత్రంలా లెనిన్ నిలిచిపోయారని సీపీఎం మల్కాజిగిరి మండల కార్యదర్శి కృపాసాగర్, సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి అన్నారు. లెనిన్ శత జయంతి సందర్భంగా మల్కాజిగిరి సీపీఎం పార్టీ కార్యాలయంలో లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం లెనిన్ ఓ విప్లవాయుధం పుస్తకాన్ని ఆవిష్కరించి సామూహిక పుస్తక పఠనం చేశారు. కార్యక్రమంలో బంగారు నర్సింగ్‌రావు, సుమిత్ర, విజయ్‌కుమార్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

జంతు జనన నియంత్రణకు బ్లూక్రాస్‌తో ఒప్పందం



ఒప్పంద పత్రం మార్చుకుంటున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి తదితరులు

మేడిపల్లి: జంతుజనన నియంత్రణ, వీధి కుక్కల కోసం యాంటీ రేబిస్ టీకాలు ఇచ్చే బ్లూక్రాస్ సంస్థతో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం ఎంఓయూ చేసుకున్నట్లు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్ త్రిల్లేశ్వర్‌రావు తెలిపారు. బ్లూక్రాస్ సంస్థ ప్రతినిధి కుమారి ఎంఓయూ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వీధి కుక్కల బెడతకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గతంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్‌లో 50శాతం కుక్కలకు ఆపరేషన్లు జరిగాయని, మిగిలిన వాటికి కూడా పూర్తి చేయాలని అలాగే ఆపరేషన్లను చేసిన కుక్కలకు రేడియం ట్యాగ్ వేయాలని సూచించారు. ఇతర ప్రాంతాలు, మున్సిపాటీల నుంచి అక్రమంగా డంప్ అవుతున్న కుక్కలపై నిఘా పెంచాలని అధికారులు ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని ఆ ప్రాంతంలోని మొత్తం కుక్కలకు ఆపరేషన్లు చేసిన తర్వాత మరో ప్రాంతంలోని కుక్కలకు ఆపరేషన్ చేయాలని మేయర్ సూచించారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యూపీహెచ్‌సీ, బస్తీ దవఖానాల్లో యాంటిరేబిస్ టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బ్లూక్రాస్ ప్రతినిధి కుమారి, నాయకులు బండి సతీష్‌గౌడ్, మేనేజర్ జ్యోతి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ మురళి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నియామకపత్రాన్ని అందుకుంటున్న ఎం.మల్లారెడ్డి

కుషాయిగూడ: విద్యార్థుల రాజకీయ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన ఎం.మల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సునీల్, గ్రేటర్ అధ్యక్షుడు నర్రా సుఖేందర్‌రెడ్డి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఉచిత విద్య, వైద్యం అందించాలనే పార్టీ ఆశయం కోసం పాటుపడతానన్నారు. పార్టీ ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం సహాయక సంఘంలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: స్వయం సహాయకం సంఘం గ్రూప్‌లో మహిళల పాత్ర కీలకమని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ వార్డు కార్యాలయంలో స్వయం సహాయక సభ్యులతో స్త్రీనిధి పథకంపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునే విధంగా స్వయం సహాయక సభ్యులు కృషి చేయాలన్నారు. మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కో ఆర్డినేటర్ వెంకటేష్, ఆమిదాల ఊర్మిళ, స్వయం సహాయక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్.. జామ్‌కాకుండా..

- ఉప్పల్‌లో జంక్షన్ల అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ కసరత్తు
- ఏడు కూడళ్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం
- ప్రతి కూడలి వద్ద 200 ఫీట్ల వరకు జంక్షన్లు



ఉప్పల్ ఏషియన్ థియేటర్ వద్ద కూడళ్లను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్‌లో ట్రాఫిక్ రద్దీని మరింత సమర్థవంతంగా తట్టుకునే విధంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పలు కూడళ్లలో జంక్షన్లను అభివృద్ధి చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రతి కూడలి వద్ద 200 ఫీట్ల వరకు జంక్షన్లు ఏర్పాటు చేయనున్నారు. ఉప్పల్ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్‌తో ప్రయాణికులు సతమతం అవుతున్నారు. ఉప్పల్ జంక్షన్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఇప్పటికే ఇక్కడ ఎలివేటెడ్ కారిడార్ పనులు కొనసాగుతున్నాయి. దీనికి తోడు ఉప్పల్ మెట్రో రైల్ ఇలా అనేక రకాలుగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నా ట్రాఫిక్ రద్దీ పెరుగుతూనే ఉంది. దీంతో ఉప్పల్ సర్కిల్ పరిధిలోని అన్ని ప్రధాన కూడళ్లపై ట్రాఫిక్ భారం తీవ్రంగా పడుతోంది. దీంతో సగటు ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. దానికితోడు నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు నివేదికలు

ఉప్పల్ పేరు చెబితేనే.. వామ్మో.. ఉప్పల్ రోడ్లు అన్నట్లుగా భయాందోళనకు గురవుతున్నారు. ఉప్పల్‌లోని ప్రధాన కూడళ్ల వద్ద జంక్షన్లను అభివృద్ధి చేయాలని, తద్వార రానున్న రోజుల్లో ట్రాఫిక్ ఇబ్బందులను సమర్థవంతంగా ఎదుర్కొనే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు జంక్షన్ల అభివృద్ధికి కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉప్పల్ చౌరస్తా వద్ద ప్రస్తుతం 150 ఫీట్ల రోడ్డు ఉంది. దాన్ని 200 ఫీట్ల వరకు వెడల్పు చేసి జంక్షన్లను అభివృద్ధి చేయనున్నారు. అలాగే వీటి కమాన్ వద్ద కూడా ఇదే విధంగా, టయోటా షోరూం వద్ద, చిలుకానగర్ టీ జంక్షన్, రామంతాపూర్ శివాజీ విగ్రహం చౌరస్తా, రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, వేంకటేశ్వర టెంపుల్ కూడలి వద్ద ఇలా దాదాపు సర్కిల్ పరిధిలో ఏడు ప్రాంతాల్లో 200 ఫీట్ల జంక్షన్లను అభివృద్ధి చేయనున్నారు. కాగా ఇప్పటికే టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రైవేటు ప్రాపర్టీలను గుర్తించి ప్రభుత్వంతో పాటు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. మొదటగా ఉప్పల్ ఏషియన్ థియేటర్ వద్ద జంక్షన్లను యుద్ధ ప్రాతిపదికన నిర్మించనున్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని నాగలక్ష్మీనగర్ కాలనీలో బుధవారం రూ.12 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు బుధవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా అంతటా నూతనంగా భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సందీప్, కాలనీ అధ్యక్షులు పీజీ సుదర్శన్, ఈశ్వర్, నాగరాజుగౌడ్, భిక్షపతి, రాజేష్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యానికి ఎంతో మేలు



శేఖర్‌గుప్తాను మెడల్స్‌తో సన్మానిస్తున్న ప్రభాకర్

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగమని ఆర్‌ఐ ఫిట్‌నెస్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బండారు ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ క్లబ్ రన్ ఆఫ్ మారథాన్ (పరుగు పందెం)లో చెంగిచర్లకు చెందిన కటకం శేఖర్‌గుప్తా దిగ్విజయంగా 21 కిలోమీటర్ల పరుగు పందెం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు మెడల్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతంగా జీవించేందుకు వ్యాయామంతో పాటు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. ఒత్తిడి తగ్గించుకుని, ఆరోగ్యవంతంగా ఉండేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కట్ట శేఖర్, మల్లేష్, నరసింహ, వెంకటరావు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన ఎంపీపీ



ఘట్‌కేసర్: అవుషాపూర్ జెడ్పీ పాఠశాలను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని, ఇష్టంతో కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు పొందాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా నీరు పోయాలని సిబ్బందిని ఆదేశించారు.

పరీక్షలు సజావుగా నిర్వహించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఇంటర్, పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు–2024కు సంబంధించి డీఐవో కిషన్, డీఈవో విజయకుమారితోసహా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల నిర్వహణలో అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 139 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రథమ సంవత్సరంలో 65,965 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరానికి 65,495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

పదో తరగతి పరీక్షలు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగుతాయని జిల్లా అదనపు కలెక్టర్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించి 231 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 47406 (రెగ్యులర్ 46834, ప్రైవేట్ 572) మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి, పరీక్షా కేంద్రం నుంచి స్ట్రాంగ్ రూంకు ఎగ్జామ్ మెటీరియల్ తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్షా కేంద్రాల నుంచి జవాబు పత్రాలను పకడ్బందీగా తీసుకువెళ్లేందుకు పోస్టల్ శాఖ సహకరించాలన్నారు.విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అనుమతి లేదని అదనపు కలెక్టర్ తెలిపారు. పరీక్షలను పారదర్శకంగా విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు,రాచకొండ,సైబ రాబాద్ పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.